క్లుప్తంగా

గుడివాడకు శ్రీవత్సవ్ అభినందనలు



గుడివాడ అమర్‌నాథ్‌ను అభినందిస్తున్న ద్రోణంరాజు శ్రీవత్సవ్, లింగం శ్రీనివాస్

అల్లిపురం : వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన గుడివాడ అమర్‌నాథ్‌ను ఆ పార్టీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అమర్‌నాథ్ ఇంట్లో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ టర్నల్ చౌల్ట్రీ చైర్మన్ లింగం శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు కొయ్య చిన్నా పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



సిరులతల్లి

మహారాణిపేట : బురుజుపేటలో కొలువైన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం అమ్మవారి మూల విరాట్‌కు క్షీరాభిషేకం నిర్వహించారు. ప్రతిశుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు ఈ క్షీరాభిషేకం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఈ రోజు క్షీరాభిషేకంలో ముగ్గురు ఉభయదాతలు పాల్గొన్నారు.

బంగారు చెయిన్ దొంగిలించిన మహిళ అరెస్ట్

అల్లిపురం : బంగారు చెయిన్ దొంగిలించిన మహిళను టూటౌన్ క్రైం పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆమె వద్ద నుంచి 46 గ్రాముల గోల్డ్ చెయిన్ స్వాధీనం చేసుకున్నారు. టూటౌన్ క్రైం ఎస్‌ఐ ఎన్.సునీల్ తెలిపిన వివరాల ప్రకారం విజయనగరం జిల్లా, కొత్తవలస మండలం, ఆళ్లవారి వీధికి చెందిన ఆళ్ల లత ఈనెల 26వ తేదీన అత్త, తోటికోడలితో కలిసి జగదాంబ వద్ద గోల్డ్ దుకాణానికి బంగారు వస్తువులు కొనడానికి వెళ్లారు. అక్కడ నచ్చకపోవటంతో సంపత్ వినాయక గుడి వద్ద గల దుకాణానికి వచ్చి అక్కడ 46 గ్రాముల గోల్డ్ చైన్ కొనుగోలు చేశారు. తర్వాత కుటుంబ సభ్యులతో కలిసి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సు ఎక్కారు. అనంతరం బ్యాగులో చూడగా వస్తువు ఉన్న పర్సు కనపించలేదు. దీంతో వెంటనే బస్సు దిగి చుట్టు పక్కల వెతికినా లాభం లేకపోవడంతో టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై నగర క్రైం డీసీపీ కె.లతామాధురి ఆదేశాల మేరకు ఈస్ట్ క్రైం సీఐ సీహెచ్ రాజుల నాయుడు, టూటౌన్ క్రైం ఎస్‌ఐ సునీల్ సిబ్బందితో కలిసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాలు పరిశీలించిన అనంతరం కొత్తవలస 202 కాలనీకి చెందిన గంట తులసి అపహరించినట్లు గుర్తించారు. ఆమెను అదుపులోకి తీసుకుని బంగారు గొలుసును రికవరీ చేసి నిందితురాలిని రిమాండ్‌కు తరలించారు.

దుర్గా నవరాత్రులకు శ్రీకారం



రాట మహోత్సవంలో పాల్గొన్న కందుల నాగరాజు తదితరులు

అల్లిపురం : దసరా ఉత్సవాల నిర్వహణలో భాగంగా శుక్రవారం 32వ వార్డు పూతివారిమాన్యంలో రాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు పాల్గొని అమ్మవారి ఉత్సవ రాటకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ అక్టోబర్ 3వ తేదీ నుంచి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిట్టెమ్మ, కందుల బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అసౌకర్యం

జోన్–5 జోనల్ కార్యాలయంలోని సౌకర్యం కేంద్రంలో ఇంటి పన్ను, కుళాయి పన్ను చెల్లించే వినియోగదారులు బిల్లులు కట్టేందుకు వచ్చినప్పుడు అవస్థలు పడుతున్నారు. ఈ కేంద్రంలో వారు బిల్లులు చెల్లించే చోట సిబ్బంది తమ బైక్‌లు పార్కింగ్ చేసుకోవడంతో వినియోగదారులకు అవస్థలు తప్పడంలేదు. అలాగే బిల్లులు చెల్లించేటప్పుడు ఆన్‌లైన్ గనుక మొరాయిస్తే గంటల కొద్దీ వేచి ఉండాల్సి వస్తుంది. ఆ సమయంలో వినియోగదారులు కూర్చునేందుకు కనీసం కుర్చీలు కూడా లేకపోవడంతో నిలబడలేని వృద్ధులు కిందే కూర్చుంటున్నారు.



సౌకర్యం కేంద్రంలో పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలు

- జోన్–5 జోనల్ కార్యాలయం సౌకర్యం కేంద్రంలో వినియోగదారుల ఇక్కట్లు
- కూర్చోవడానికి కుర్చీలూ కరవే
- సర్వర్ డౌన్ అయితే గంటల కొద్దీ తప్పని నిరీక్షణ
- అధికారులు స్పందించాలంటున్న పన్ను చెల్లింపుదారులు



ఆవరణలో సిబ్బంది సొంత బైకులకు చార్జింగ్ పెట్టుకున్న దృశ్యం (ఫైల్)

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం జోన్–5 జోనల్ కార్యాలయంలోని సౌకర్యం కేంద్రంలో అన్నీ అసౌకర్యాలే. ఇంటి పన్ను, మంచినీటి పన్ను ఇతర సేవలను వినియోగించుకోవటానికి ఈ కేంద్రానికి వెళ్లే వినియోగదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. నగదు చెల్లింపు కౌంటర్ల వద్ద ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. జోన్ సిబ్బంది, జోనల్ కార్యాలయానికి వచ్చే ప్రజల వాహనాలు కూడా ఇక్కడ నిలపడంతో వినియోగదారులు కౌంటర్‌లో నగదు చెల్లించేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఈ కేంద్రంలో ఆన్‌లైన్ ఇబ్బందులు తలెత్తితే గంటలకు గంటలు నిలబడి వేచి ఉండాల్సి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ కనీసం కూర్చోవడానికి కుర్చీలు కూడా లేకపోవడంతో ఎంత సమయమైనా నిలబడే వేచి ఉండాల్సి వస్తుంది. నిలబడలేని వృద్ధులు కిందే కూర్చుని తమ వంతు వచ్చే వరకు నిరీక్షిస్తున్నారు. జోన్–5 జోనల్ కార్యాలయానికి అధిక ఆదాయం సమకూర్చే సౌకర్యం కేంద్రాన్ని అధికారుల అలసత్వం పట్టి పీడిస్తోందని పలువురు విమర్శిస్తున్నారు.



సౌకర్యం కేంద్రం వద్ద వినియోగదారులు (ఫైల్)

వినియోగదారులు తిరుగాడే చోట బైక్‌లకు చార్జింగ్..

సౌకర్యం కేంద్రంలో వినియోగదారులు పన్నులు చెల్లించే చోట సిబ్బంది తమ బ్యాటరీ వాహనాలకు చార్జింగ్ పెడుతున్నారు. దీని వల్ల వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు చెప్పినా స్పందన లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన కార్యాలయం ఎదుట కార్లు పార్కింగ్ చేయడంతో సౌకర్యం కేంద్రం వద్ద ద్విచక్ర వాహనాలు పార్క్ చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని పలువురు వినియోగదారులు కోరుతున్నారు.

పార్కింగ్‌తో ఇబ్బందులు..



జోన్–5 సౌకర్యం కేంద్రంలో సిబ్బంది వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో బిల్లులు చెల్లించేటప్పుడు చాలా ఇబ్బంది పడుతున్నాం. సర్వర్ పని చేయనప్పుడు గంటల తరబడి వేచి ఉంటున్నాం. ఆ సమయంలో కూర్చోడానికి కనీసం కుర్చీలు కూడా ఉండడం లేదు. ఎంత సమయమైనా నిలబడే ఉండాల్సి వస్తోంది. దీనివల్ల వృద్ధులు చాలా ఇబ్బంది పడుతున్నారు.

– ఎ. రత్నకుమారి, టీచర్, జ్ఞానాపురం

అధికారులు స్పందించాలి..



సౌకర్యం కేంద్రంలో సర్వర్ డౌన్ అయినప్పుడు గంటల పాటు వేచి ఉండాల్సి వస్తుంది. అలాంటి సమయంలో వినియోగదారులు కూర్చోవడానికి కుర్చీలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది. అయితే అటువంటి సదుపాయం లేక ఇబ్బంది పడుతున్నాం. ముసలివాళ్లు, చిన్నపిల్లలు వస్తే వేచి ఉండలేక ఇబ్బంది పడుతున్నారు. అధికారులు ఈ సమస్య పరిష్కారానికి కృషి చేయాలి.

– యల్లపు ప్రసాద్, అడ్వకేట్, జ్ఞానాపురం

నూతన కార్యవర్గం ఎన్నిక



గ్రంథాలయ కార్యదర్శిని అభినందిస్తున్న కార్యవర్గ సభ్యులు

అల్లిపురం : జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఈ నెల 6వ తేదీన ఏకగ్రీవంగా ఎన్నికయింది. ఈ మేరకు సభ్యులు శుక్రవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్.సి.హెచ్.వెంకటరావుని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. సంఘం నూతన అధ్యక్షుడిగా వి.ఆనందరావు (యలమంచిలి), ఉపాధ్యక్షులుగా పి.దమయంతి (నర్సీపట్నం), ప్రధాన కార్యదర్శులుగా ఎన్‌వీ నరసింహం (అడవివరం), ఎల్.రాజేంద్రవర్మ (డీసీఎల్), కోశాధికారిగా కె. శ్రీనివాసరావు (తుమ్మపాల), రాష్ట్ర ప్రతినిధిగా వై.వెంకటేశ్వర్లు (మాడుగుల), కార్యవర్గ సభ్యులుగా ఎల్‌వీ రమణ (మునగపాక), పీవీఎన్ రాజు (డీసీఎల్ స్టేట్), బీవీఎస్ అప్పారావు (పద్మనాభం), బి. చంద్రకళ (గాజువాక), జి. పైడిరాజు, ఎస్.రాజబాబు (నర్సీపట్నం), ఎం.పద్మావతి (చౌడువాడ), పీవీ రమణ (పెదగంట్యాడ), డి.కోటేశ్వరరావు (తిమ్మరాజుపేట), సీనియర్ అసిస్టెంట్ యోగానంద్, ఎస్.లక్ష్మణరావు, కృష్ణ, శ్రీను ఎన్నికయ్యారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు

కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెం పరిధి దుర్గానగర్‌లో దుర్గమాంబ అమ్మవారి ఆలయంలో శ్రీరామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ అమ్మవారికి కుంకుమ పూజలు, పంచామృతాభిషేకం జరిపారు. ఆలయ ఆవరణలో కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

టెక్నాలజీ మానవుని అదుపాజ్ఞల్లో ఉండాలి

అల్లిపురం : టెక్నాలజీ మానవుని అదుపాజ్ఞల్లో ఉండాలి గాని, టెక్నాలజీ చేతుల్లోకి మానవ సమాజం వెళ్లడం అపాయకరమని విశాఖ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల అన్నారు. కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మొబైల్ అడిక్షన్‌పై నిర్వహించిన సెమినార్‌లో ఆమె మాట్లాడారు. మొబైల్ అనేది విద్యార్థులతో పాటు అందరి సమయాన్ని వృథా చేస్తుందన్నారు. ఆరోగ్య సమస్యలకు సైతం కారణమవుతుందన్నారు. కళాశాల బీఎస్సీ మూడవ సంవత్సరం విద్యార్థుల బృందం సెమినార్‌లో ప్రదర్శించిన మొబైల్ అడిక్షన్ వల్ల కలిగే నష్టాలు, నివారణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సెమినార్ కోఆర్డినేటర్ బి.సంతోష్, అనూష, డాక్టర్ ఎ. హైమావతి, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఆర్.కిరణ్మయి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అతిగా మొబైల్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్న విద్యార్థిని

29న 'నవతి ప్రసన్నం'

మహారాణిపేట : ఎన్నో పుస్తకాలు రచించిన ఆంధ్రా యూనివర్సిటీ మాజీ రెక్టార్, సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.ప్రసన్నకుమార్ 90 వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈనెల 29న నవతి ప్రసన్న కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.రఘురామారావు తెలిపారు. శుక్రవారం జిల్లా పరిషత్‌లో ఉన్న అంకోశా హాల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోస్టర్, ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మచిలీపట్నంలో జన్మించి విశాఖలో స్థిరపడ్డ ఆచార్య ప్రసన్నకుమార్ నాలుగు దశాబ్దాలుగా 25 పుస్తకాలు రచించారని తెలిపారు. ఆయన మార్గదర్శకత్వంలో 25 మంది విద్యార్థులు పీహెచ్‌డీలు పొందారని అన్నారు. ఏపీ ప్రభుత్వం, అంతర్జాతీయ సంబంధాలపై రెండు పాఠ్య పుస్తకాలకు ఎంతో పేరు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, మిజోరం గవర్నర్ డాక్టర్ కె.హరిబాబు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ గోపాలకృష్ణ, డాక్టర్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ రఘురామారావు తదితరులు

ఎస్‌బీసీ బ్రిడ్జిపై రాకపోకలకు అనుమతించాలి

సింధియా: సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెనకు ప్రత్యామ్నాయంగా ఉన్న ఎస్‌బీసీ బ్రిడ్జిపై రాకపోకలకు అనుమతించాలని డిమాండ్ చేస్తూ నేవల్ సివిలియన్ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు విజయనగర్ గేటు వద్ద నిరసన తెలిపారు. విశాఖ నేవల్ డాక్‌యార్డ్‌లో పనిచేస్తున్న దిలీప్‌కుమార్ శుక్రవారం సాయంత్రం విధులు ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్తుండగా షీలానగర్ వద్ద ప్రమాదానికి గురై మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న నేవల్ సివిలియన్ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని విచారం వ్యక్తం చేశారు. అనంతరం దిలీప్‌కుమార్ మృతికి వ్యతిరేకంగా విజయనగర్ గేటు వద్ద నిరసన తెలిపారు. ఎస్‌బీసీ బ్రిడ్జిపై నుంచి రక్షణరంగ ఉద్యోగుల రాకపోకలకు అనుమతించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ రెండు నెలలుగా ఎస్‌బీసీ బ్రిడ్జిపై నుంచి ఉద్యోగుల రాకపోకలకు అనుమతించాలని పదే పదే కోరుతున్న యాజమాన్యం నిరాకరిస్తోందన్నారు. రక్షణ శాఖ మంత్రికి, నేవీ ఉన్నతాధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదని వాపోయారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో డాక్‌యార్డ్, షీలానగర్ రోడ్డులో భారీ వాహనాలను నియంత్రించాలని కోరినా పట్టించుకునే నాథుడు లేడని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం ఈ రోడ్డులో ఎవరో ఒకరు ప్రమాదానికి గురవుతున్నారని, ఇప్పటికైనా యాజమాన్యం స్పందించాలని కోరారు. యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, నాయకులు శేఖర్, కాశీం, భానోజీ, పరమేష్, నాగార్జున, రాజేష్, గణేష్, నాయుడు పాల్గొన్నారు.



విజయనగర్ గేటు వద్ద నేవల్ సివిలియన్ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యుల నిరసన

కొత్తపల్లి జ్యోతికి ఉమెన్ ఐకాన్ ఆఫ్ ఇండియా అవార్డు

అల్లిపురం : నగరానికి చెందిన జ్యోతి కొత్తపల్లి ఈ నెల 25వ తేదీన జైపూర్‌లో నటి సుధా చంద్రన్ చేతుల మీదుగా ఉమెన్ ఐకాన్ ఆఫ్ ఇండియా అవార్డుతో పాటు భారతదేశ విశిష్ట వ్యక్తిత్వం అవార్డు అందుకున్నారు. ఇండియాస్ అన్‌సంగ్ హీరోస్ నేషనల్ అవార్డు–2024 ద్వారా నిర్వహించిన కార్యక్రమం జైపూర్‌లోని రాడిసన్ బ్లూ హోటల్లో జరిగింది. ఈ సందర్భంగా జ్యోతి కొత్తపల్లి మాట్లాడుతూ భారతదేశంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు, ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్లు, మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య ఈ అవార్డును పొందడం ఆనందంగా ఉందన్నారు. తనకు సపోర్టు చేసిన యూఎస్ ట్యాంక్ టీమ్ మెంబర్స్, తల్లిదండ్రులు, స్నేహితులకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



నటి సుధా చంద్రన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న జ్యోతి కొత్తపల్లి

నేడు వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బి.ప్రసాద్ తెలిపారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల నిర్వహించి, సుప్రభాతం చదివి వినిపిస్తామన్నారు. సాయంత్రం నక్షత్ర హారతి, కర్పూర హారతి, కూష్మాండ హారతి, కుంభ హారతి ఇవ్వనున్నట్లు ఈవో చెప్పారు.

సుధాకర్ ప్రసాద్‌కు ఘన నివాళి



సుధాకర్ ప్రసాద్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న డీఆర్‌వో మోహన్‌కుమార్ తదితరులు

మహారాణిపేట : ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు తోట సుధాకర్ ప్రసాద్ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం రెవెన్యూ అతిథి గృహంలో నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ సుధాకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ ఎస్.నాగేశ్వర రెడ్డి, ఏపీఆర్‌ఎస్‌ఏ విశాఖ జిల్లా అధ్యక్షుడు త్రినాథ్, కార్యదర్శి సీహెచ్.వి.రమేష్, సిటీ అధ్యక్షుడు యోగి, కార్యదర్శి బి.రవిశంకర్, ఏపీజేఏసీ అమరావతి మహిళా వింగ్ చైర్‌పర్సన్ శైలజ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫ్రైడే డ్రైడే కార్యక్రమం పర్యవేక్షణ



నిల్వ నీటిలో లార్వా జాడలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు శుక్రవారం ఆదర్శనగర్, ఫిషర్‌మెన్ కాలనీల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పలు ఇళ్లను ఆయన పరిశీలించారు. కొన్ని చోట్ల లార్వా అధికంగా ఉండడం గమనించి సత్వర చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారిని ఆదేశించారు. ఎక్కడైనా ఫీవర్, డెంగ్యూ కేసులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కేసులు నమోదు అయితే ఆ ప్రాంతాల్లో యాంటీలార్వా ఆపరేషన్ జరుగుతోందా లేదా వివరాలు అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నగరానికి ఈశాన్య ట్రైనీ పోలీసులు

విశాఖ సిటీ: నార్త్ ఈస్ట్ పోలీస్ అకాడమీ (నెపా) నుంచి 5 మంది ట్రైనీ డీఎస్పీలు, 10 మంది ట్రైనీ ఎస్సైలు అధ్యయన పర్యటన (భారత్ దర్శన్) నిమిత్తం విశాఖకు వచ్చారు. ఈ నెల 29వ తేదీ వరకు పోలీస్ విభాగానికి చెందిన పోలీస్ కంట్రోల్ రూమ్, 3వ పట్టణ పోలీస్‌స్టేషన్, ఫింగర్ ప్రింగ్ బ్యూరోతో పాటు నగరంలో పలు అధ్యయన కేంద్రాలు, చారిత్రాత్మక, పురావస్తు ప్రదేశాలను సందర్శించనున్నారు. శుక్రవారం వీరిని బీచ్ రోడ్డులో ఉన్న పోలీస్ ఆఫీసర్ మెస్‌లో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి కలిశారు. వారితో సమావేశం నిర్వహించి పలు అనుభవాలను పంచుకున్నారు. మెళకువలను వివరించారు. దేశ, రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన విధులపై అవగాహన కల్పించారు.

కౌన్సిల్ సమావేశం సంతృప్తికరం

అల్లిపురం : జీవీఎంసీ కౌన్సిల్ సమావేశాలు మూడు రోజుల పాటు జరగడం, జీరో అవర్‌ని నిరాటంకంగా 9 గంటల పాటు నిర్వహించడం అభినందనీయమని కూటమి ఫ్లోర్ లీడర్లు పీలా శ్రీనివాసరావు, భీశెట్టి వసంతలక్ష్మి, గంధం శ్రీనివాసరావు తదితరులు అన్నారు. శుక్రవారం ఉదయం టీడీపీ ఫ్లోర్ లీడర్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో పల్లా శ్రీనివాస్, గంకల కవిత (బీజేపీ), శరగడం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ఇంద్రాణి జగ్గారావు కృషి

అల్లిపురం : ఉత్తరాంధ్రలో గ్రామీణ మహిళల విద్యాభివృద్ధికి తన తల్లి ఇంద్రాణి జగ్గారావు విశేష కృషి చేశారని ఏవీఎన్ కళాశాల వైస్ చైర్మన్, కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావు అన్నారు. మిసెస్ ఏవీఎన్ కళాశాల పూర్వ కరస్పాండెంట్ ఇంద్రాణి జగ్గారావు 90వ జయంతిని పురస్కరించుకుని కళాశాల ఉమెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఇంద్రాణి జగ్గారావు చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంద్రాణి జగ్గారావు పేద విద్యార్థుల కోసం బాల్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. విశాఖ నగరాభివృద్ధికి వివిధ సంస్థల ద్వారా సేవలందించడంతో పాటు లోక్ అదాలత్ సభ్యురాలిగా ఎన్నో న్యాయ సమస్యలు పరిష్కరించారన్నారు. కార్యక్రమంలో అలూమినీ అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు మాకెన శ్రీనివాసరావు, మోటివేషన్ స్పీకర్ గోపికా చాగంటి, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు, ఉమెన్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఎంవీ భానుమతి, కార్యదర్శి డాక్టర్ అర్చన, కోశాధికారి సుస్మిత, ఉపాధ్యక్షురాలు కృష్ణకుమారి, డీన్ జి. శంకరనారాయణ, స్వరాజ్యలక్ష్మి, పైడి రజని, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఇంద్రాణి జగ్గారావు సంస్మరణ సభలో పాల్గొన్న అతిథులు

3 నుంచి వాసవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

అల్లిపురం : కురుపాం మార్కెట్‌లో గల శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అక్టోబర్ 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు వాసవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు దేవాలయ అధ్యక్ష, కార్యదర్శులు అరిశెట్టి దినకర్, పెనుగొండ కామరాజు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా మూలవిరాట్టుకు ప్రతి రోజు రోజుకొక అవతారంలో అలంకరణ ఉంటుందన్నారు. మహిళలు, కన్యలు, విద్యార్థులతో వివిధ రకాల సామూహిక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి రోజు అమ్మవారికి తెల్లవారు జాము నుంచి పంచామృతాభిషేకాలు, హోమ కార్యక్రమాలు, సామూహిక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు కడిమిశెట్టి వెంకటరమణ, పూసర్ల సంజీవరావు, వెదుళ్లపల్లి శ్రీనివాసరావు, కోశాధికారి దోమా వెంకటరమణ, బాలాజీకుమార్, దేవాలయ అర్చకుడు ఆర్‌బీబీ కుమార్‌శర్మ, కమిటీ అడ్వైజర్లు ఉత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు.



దసరా ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

విద్యార్థుల నౌకా సందర్శన





నౌకలు పని చేసే విధానం గురించి విద్యార్థులకు వివరిస్తున్న సిబ్బంది

మహారాణిపేట : భారతీయ మత్స్య పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఫిషింగ్ హార్బర్ జెట్టీ 5,6లో మత్స్య శికారీ, మత్స్య దర్శిని కార్యక్రమం జరిగింది. విద్యార్థుల సందర్శన కోసం మినీ ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ ప్రదర్శనలో నౌకలో ఉన్న పరికరాలు,నావిగేషన్, కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, లైఫ్ సేవింగ్, అగ్నిమాపక ఉపకరణాలు (ఫైర్ ఫైటింగ్ అప్లియన్సెస్), మత్స్య సంపద అభివృద్ధికి దోహపడే అంశాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను బెహరా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేరీటైం ట్రెనింగ్ విద్యార్థులు, సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ నాటికల్ అండ్ ఇంజినీరంగ్ ట్రెనింగ్ (సీఐఎఫ్ఎన్ఈటీ) విద్యార్థులు, ప్రజలు వీక్షించారు. భారతీయ మత్స్య పరిశోధన సంస్థ కార్యాలయ ముఖ్య అధికారి డి.భామిరెడ్డి కార్యక్రమం విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో భారతీయ మత్స్య పరిశోధనా సంస్థ అధికారులు, మత్స్య శికారి, మత్స్యదర్శిని సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని డాక్‌యార్డు ఉద్యోగి మృతి

అక్కిరెడ్డిపాలెం : విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న నేవల్ డాక్‌యార్డ్ ఉద్యోగిని లారీ రూపంలో మృత్యువు కబళించింది. తమ కళ్లెదుటే ఉద్యోగి దుర్మరణం చెందడంతో తోటి ఉద్యోగులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం అరడకోటకు చెందిన ఎం.దిలీప్ కుమార్ (26) నేవల్ డాక్‌యార్డ్‌లోని టీఎంఎం విభాగంలో పనిచేస్తున్నాడు. షీలానగర్‌లో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం విధులు ముగించుకుని స్కూటీపై ఇంటికి బయలు దేరాడు. డాక్ యార్డు నుంచి షీలానగర్ టోల్ గేటు వైపు వస్తుండగా వెనుక నుంచి వస్తున్న లారీ అతని వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో దిలీప్ కుమార్ అదుపుతప్పి పడిపోవడంతో అతని తలకు తీవ్ర గాయమైంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు ప్రమాదం వివరాలు సేకరించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని గాజువాక స్టేషన్‌కు తరలించారు. దిలీప్ కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అతనికి ఇటీవలే వివాహం అయినట్టు ట్రాఫిక్ సీఐ తెలిపారు.



దిలీప్ కుమార్ మృతదేహం